నిర్లక్ష్యపు నీడలో నిర్మాణాలు

- నిలిచిన రైతు సేవ, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు
- రూ.కోట్ల ప్రభుత్వ ఆస్తులకు గ్రహణం
- సర్దుబాటు పేరుతో సిబ్బంది కుదింపు
- ఐదేళ్లుగా ముందుకు సాగని వైనం


హెచ్.కొత్తూరులో నిలిచిపోయిన సచివాలయ నిర్మాణ పనులు

తుని రూరల్: గ్రామీణులకు స్థానిక గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను నిర్మించతలపెట్టింది. అందులో భాగంగా తేటగుంట, టి.వెంకటాపురం, లోవకొత్తూరు, హంసవరం, చామవరం, కేఓ మల్లవరం-1, డి.పోలవరం-1 తదితర గ్రామాల్లో గ్రామ సచివాలయాల నిర్మాణాలను పూర్తి చేసి సేవలను ప్రారంభించారు. టి.వెంకటాపురంలో వెల్‌నెస్ సెంటర్, తేటగుంటలో రైతు భరోసా కేంద్రాన్నిసైతం ప్రారంభించి సేవలు అందిస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేల నిర్మాణాలు చివరిదశలో కొన్ని, పునాదుల దశలో మరికొన్ని ఉన్నాయి. అనూహ్యంగా గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో గ్రామాల్లోనే సేవలు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకేల నిర్మాణ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. ఒక్కో సచివాలయానికి 12మంది ఉద్యోగులను నియమించింది. వారు పని చేసేందుకు మాత్రం సరైన భవనాలు లేక అద్దె చెల్లిస్తూ మరి కొన్నిచోట్ల ప్రైవేటు గృహాలలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

బిల్లులు చెల్లించక..

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి నిర్మాణాలను విస్మరించడంతో బిల్లులు చెల్లించలేదు. ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు రాక, అప్పులు చేసి మరింత పెట్టుబడులు పెట్టలేక కాంట్రాక్టర్లు నిర్మాణాల జోలికి వెళ్లలేదు. దీంతో ఆయా భవనాలలో తుప్పలు పెరిగిపోవడం, కొన్ని భవనాలు అసాంఘిక శక్తులకు నిలయాలుగా మారాయి. బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని కాంట్రాక్టర్లు, భవన నిర్మాణాలు పూర్తిచేసి ఎప్పటి నుంచి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని గ్రామీణ ప్రజలు ఎదురు చూస్తున్నారు. మెటీరియల్ కాస్ట్ ఎక్కువగా ఉండడం మరోపక్క సచివాలయాల్లో సర్దుబాటు పేరుతో ప్రభుత్వం సిబ్బందిని కుదిస్తుంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామీణ వ్యవస్థ మెరుగుపర్చడంలో భాగంగా సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకే నిర్మాణాలను పూర్తి చేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.


హెచ్.కొత్తూరులో మధ్యంతరంగా నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం


హంసవరంలో వైద్య సేవల కోసం నిర్మించిన వెల్‌నెస్ సెంటర్

180కి పైగా భవనాలు

తుని నియోజకవర్గంలో 60 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రతిపాదికన రెండు వేల మందికి ఒక సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే చొప్పున 180కిపైగా భవనాలు మంజూరు అయ్యాయి. ఒక్కొక్క సచివాలయం రూ.40 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.16.50 లక్షలు, ఆర్‌బీకేకు రూ.18.50 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. కాలానుగుణంగా నిర్మాణ వ్యయం పెరగడంతో కొన్ని సచివాలయాలకు రూ.నాలుగు లక్షలు వరకు అదనపు వ్యయం చెల్లించారు. దీంతో కాంట్రాక్టర్లు శరవేగంగా పనులు చేసినప్పటికి చివరిదశలో ప్రభుత్వం మారడంతో బిల్లులు చెల్లింపు నిలిచిపోయింది. తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు చివరి దశలో నిలిచిపోవడంతో గ్రామీణులకు ప్రభుత్వ సేవలు ఎండమావిలయ్యాయి. ఈ భవనాలు పూర్తయితే ప్రభుత్వానికి రూ.కోట్ల ఆస్తులు సమకూరినట్టయ్యేది.

నిర్వీర్యం చేసేందుకే..

గ్రామీణులకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంచడం ఇష్టం లేదు. సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకే భవనాలు పూర్తయితే ప్రభుత్వ సేవలు, వైద్య సేవలు, వ్యవసాయ, అనుబంధ సేవలు ప్రజల ముంగిటే అందుబాటులోకి వస్తాయి. అలా ప్రజలకు సేవలు అందించడం ఇష్టం లేకపోవడం, ఈ ఘనత గత ప్రభుత్వానికి దక్కుతుందన్న అనాలోచిత చర్యలతో నిర్మాణాలు, బిల్లులు చెల్లింపు నిలిపివేశారు.

– టి.చక్రరావు, గ్రామస్తుడు, ఎస్.అన్నవరం,

ప్రభుత్వానికి ఖర్చుల భారం తగ్గుతుంది

గ్రామీణులకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందు ఉద్దేశించిన సచివాయాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకే (రైతు సేవా కేంద్రం)ల నిర్మాణదారులకు బిల్లులు చెల్లించలేదు. కాంట్రాక్టర్లు భవనాలను పూర్తి చేసి అప్పగించలేదు. కొన్ని భవనాలు ప్రారంభించలేదు. ఈ భవనాలు పూర్తయితే ప్రభుత్వానికి రూ.కోట్ల ఆస్తి సమకూరి, ఖర్చుల భారం తగ్గుతుంది.

– డివిజన్ స్థాయి అధికారి

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రౌతులపూడి: మండలంలోని 26 పంచాయితీ గ్రామాల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు ఎస్వీ నరేష్ గురువారం పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు 1,150 మంది ఓటర్లకు పైగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ పరిశీలన చేసినట్లు తెలిపారు. మండలంలోని 44 పోలింగ్ భూత్‌లకు గాను రౌతులపూడిలో 180 మంది, ఎం.చామవరంలో 183 మంది, పి.చామవరంలో 194 మంది, పారుపాకలో195మంది, ఎస్.అగ్రహారంలో 198మంది, రాఘవపట్నంలో 203 మంది ఓటర్లు అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వీఆర్ఓలు పాల్గొనారు.

తైక్వాండో జాతీయ పోటీల్లో పతకాలు


విజేతలు కార్తిక రాజు, తన్వీర్ సత్యం

అన్నవరం: ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో ఈ నెల 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక సత్యదేవ తైక్వాండో క్లబ్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు కోచ్ కేవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. సబ్ జూనియర్ అండర్ 21 కేజీల విభాగం నుంచి టీ.కార్తిక రాజు, అండర్ 38 కేజీ విభాగంలో ఎన్.తన్వీర్ సత్యం కాంస్య పతకాలు సాధించినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులను స్థానిక శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కృష్ణ వర్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శ్రీ సత్యదేవ తైక్వాండో క్లబ్ విద్యార్థులు అభినందించారు.

మాజీ మంత్రి పరామర్శ


బొద్దవరంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

కోటనందూరు: బొద్దవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ పెతకంశెట్టి అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా గురువారం బాధిత కుటుంబాన్ని వారి స్వగృహంలో పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వేగి అప్పలనాయుడు, యల్లపు సత్యన్నారాయణ, దొడ్డి బాబ్జీ తదితరులు ఉన్నారు.

గిరిజనుల సంక్షేమంపై గ్రామసభ

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం ద్వారా అందించే వివిధ సంక్షేమ పథకాలపై ఎంపీడీఓ జి.శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ధాత్రి అబా జాతీయ గ్రామ ఉత్కర అభియాస్ (పీఎండీఏజేజీయూఏ) కార్యక్రమంలో భాగంగా రాఘవపట్నంలో నిర్వహించిన ఈ గ్రామసభలో ప్రభుత్వం సంక్షేమ పథకాలు వాటి నిర్వహణపై అవగాహన కల్పించారు. విద్య, వైద్యం, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు, గృహ నిర్మాణాలు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ వంటి వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు అవసరమైన చర్యలు చేపడతున్నామని ఎంపీడీఓ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, సర్పంచ్ రాయపల్లి లోవరాజు, తహసీల్దారు ఎస్వీ నరేష్, ఎంఈఓ గాడి కొండ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తి

శంఖవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం, సాయంత్రం తేడా లేకుండా రోజంతా వర్షం కురవడంతో బయటకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరి నాడు మడులు నీట మునిగాయి. శంఖవరం, కత్తిపూడి, కొంతంగి గ్రామాల్లో పెద చెరువులు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. గాలివానలకు విద్యుత్ అంతరాయం కలగడంతో గృహదారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంలో అధికంగా తడవడంతో జ్వరం, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు.

వారాహీదేవి అలంకరణలో..

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధిగాంచిన దేవీ చౌక్ ఆలయంలో కొలువైయున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు గురువారం వారాహీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వారాహీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నాటు సారా విక్రేతల అరెస్ట్


కొండ ప్రాంతంలో సారాతో పట్టుబడ్డ నిందితులతో ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది

రౌతులపూడి: మండల కేంద్రం రౌతులపూడి శివారు ఏలేరు కాలువ సమీపంలోని కొండ ప్రాంతంలో అక్రమంగా సారా తయారు చేసి రవాణాకు సిద్ధం చేసిన 200 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నామని రౌతులపూడి ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు. రౌతులపూడి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు గురువారం సారా తయారీ, రవాణాపై దాడులు జరిపామన్నారు. ఈ దాడుల్లో రౌతులపూడి గ్రామానికి చెందిన గొలుసు గోవింద్, పెంకే శ్రీను, నడిగట్ల శ్రీను, గంప ఏసు అనే నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఎస్సై వివరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు రాంబాబు, రాఘవ, సుభాష్ చంద్రబోస్, హోంగార్డు వెంకటేష్ పాల్గొన్నారని వెల్లడించారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఏలేశ్వరం: తిమ్మరాజు చెరువు ప్రధాన పంటకాలువల్లో పూడికతీత పనులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. చెరువు పరిధిలోని ఏలేశ్వరం, లింగంపర్తిల్లోని కాలువల్లో రూ.38 లక్షలతో పూడిక పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిమ్మరాజుచెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు పూడికతీత పనులను ప్రారంభించామన్నారు. అనంతరం పేరవరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, నీటిసంఘం చైర్మన్లు సుబ్బరాజు, సామంతుల కిషోర్, రైతులు పాల్గొన్నారు.

కుండపోత వర్షంతో ఇబ్బందులు

తొండంగి: నైరుతి రుతుపవనాల ప్రభావం, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో కుండపోతగా రెండు రోజుల నుంచి వర్షం తెరిపివ్వకుండా కురిసింది. గురువారం సాయంత్రం ఈదుర గాలులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు తమ దైనందిన పనులకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు అవస్థలుపడ్డారు. ఇప్పటికే తాండ్రబట్టీలు, ఇటుకల బట్టీలు మూతపడ్డాయి. భవన నిర్మాణపనులకు ఆటంకం కలగడంతో కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొద్ది రోజులపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించడంతో లోతట్టు, తీరప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

ఎగసిపడుతున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని దానవాయిపేట, పెరుమాళ్లపురం, అద్దరిపేట, యర్రయ్యపేట, తాటియాకులపాలెం, పంపాదిపేట, కొత్తచోడిపల్లిపేట సముద్రతీరాల్లో సుమారు రెండు మీటర్ల నుంచి మూడు మీటర్ల వరకూ సముద్ర అలలు ఎగసిపడుతున్నాయి. తీరప్రాంత మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లవద్దని తుని మత్స్యశాఖ అభివద్ధి అధికారి సీహెచ్.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులను వెనక్కి తిరిగి రావాలని సూచించామన్నారు.


దానవాయిపేట సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు

ఎడతెరిపి లేని వర్షం

ఏలేశ్వరం: అల్పపీడన ప్రభావంతో నియోజవర్గ వ్యాప్తంగా గురువారం ఎడతెరిపి లేకుండా వర్షం దంచి కొట్టింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలుప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. స్థానిక క్వారీ ప్రాంతంలో వర్షపునీరు రహదారిపై నిల్వ ఉండిపోయింది. లింగవరం కాలనీలో ఎంపీపీ స్కూల్ ప్రాంగణం బురదమయంగా మారింది. మండలంలోని లింగంపర్తి, జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, యర్రవరం తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. వర్షపునీటిని తొలగించే ఏర్పాట్లు అధికారులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాలకు రైతులు ఖరీఫ్ నిమిత్తం రైతులు ఆకుమడులు సిద్ధం చేస్తున్నారు. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


గోపాలపట్నంలో కురుస్తున్న కుండపోత


ఏలేశ్వరం ఆర్టీసీ కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

నట్టల నివారణ మందు పంపిణీ

గండేపల్లి: నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తాతయ్య మండలంలోని పాడిరైతులకు సూచించారు. గండేపల్లి గ్రామంలో గురువారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో నట్టల నివారణ శిబిరం జూలై 10 వరకు జరుగుతుందని ఈ ఉచిత కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి ప్రగడ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

తొండంగి: మండలంలోని రెండు రోజుల నుంచి అడపా దడపా విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మండలంలోని గోపాలపట్నం, ఏ.కొత్తపల్లి, తొండంగి, రావికంపాడు, బెండపూడి తదితర గ్రామాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా అనేక దఫాలుగా విద్యుత్‌సరఫరా నిలిచిపోతుంది. ఈ కారణంగా గృహ, వ్యాపార తదితర వినియోగదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. రాత్రి సమయాల్లో మరింత ఎక్కువగా కోత విధించడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంటుందని, తరచూ చోరీలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

11 గ్రామాలకు నేడు కరెంట్ కట్

ప్రత్తిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లోని 11 కేవీ ఫీడర్లలో కొత్త లైన్ల పునరుద్ధరణ పనుల నిమిత్తం ప్రత్తిపాడు మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట ఈఈ బి.వీరభద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని లంపకలోవ, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పి.జగన్నాధపురం, పెద్దిపాలెం, పెద్దిపాలెం, వేములపాలెం, గోకవరం, మెట్టుచింత, రౌతుపాలెం, ఉత్తరకంచి, వంతాడ గ్రామాలకు ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 12.గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. కావున అంతరాయానికి సహకరించాల్సిందిగా ఆయా గ్రామాల వినియోగదారులను ఈఈ కోరారు.

వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టాలి

జగ్గంపేట: గ్రామీణ ప్రాంతాలలో ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలు ప్రజల అవసరాలను తీర్చినట్లు నటిస్తూ అధిక వడ్డీలతో సామాన్యులను పీడించుకుని తింటున్నారని సీపీఐ ఎంఎల్ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్ మండిపడ్డారు. జగ్గంపేటలో పెన్షనర్స్ భవనంలో గురువారం జరిగిన పార్టీ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసి మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ప్రభుత్వ రంగ బ్యాంకులు వడ్డీలేని రుణాలు ఇచ్చేలా కృషి చేయాలన్నారు. ఫైనాన్స్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు, జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జక్కంపూడి రాజు, పలువురు నేతలు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ ఫిర్యాదుకు స్పందన

కిర్లంపూడి: మండల పరిధిలోని సోమరాయణంపేట జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని బొడ్డేటి అప్పారావు గత 18న కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో చేసిన ఫిర్యాదుకు అధికారులు స్పందించారు. గురువారం ఉన్నతాధికారులు ఆదేశాలతో హౌసింగ్ ఏఈ భవానీ గురువారం జగనన్న కాలనీకి వెళ్లి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయవలసిన వీధులను పరిశీలించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం పాఠశాల నుంచి వివిధ పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను గురువారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలుగా పని చేసిన గంధం ప్రమీలరాణి, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఎస్వీఎన్ ప్రసాద్, రమేష్, గణిత ఉపాధ్యాయుడు నాగభూషణం, పీడీ విజయకుమారి, హిందీ ఉపాధ్యాయురాలు సరళ కుమారిని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

డ్రగ్స్‌తో ఆర్థిక వ్యవస్థకు దెబ్బ


అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ప్రసంగిస్తున్న సీఐ సూర్య అప్పారావు

ప్రత్తిపాడు: సమాజానికి పెనుభూతంలా మారిన మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ప్రత్తిపాడులో పోలీసులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభించిన ఈ ర్యాలీ మార్కెట్, మెయిన్‌రోడ్డు గుండా స్థానిక అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు సాగింది. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్‌కు బానిసైతే ఇల్లు, ఒళ్లు గుల్లయ్యి, ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా సమాజంలో చులకన అవుతారన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు ఎస్ లక్ష్మీకాంతం, రామలింగేశ్వరరావు, శ్రీహరి, వెంకటేశ్వరరావు, అన్నవరం అడిషనల్ ఎస్సై ప్రసాద్, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థి, విద్యార్థినీలు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆదిత్య సిబ్బంది

చులకన భావంతో బతకాలి

గండేపల్లి: విద్యార్థులు డ్రగ్స్, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ విద్యార్థులనుద్దేశించి అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న అనకాపల్లి డివిజన్ విశ్రాంత డీఎస్పీ బోను అప్పారావు మాట్లాడుతు డ్రగ్స్‌కు అలవాటుపడితే ఆరోగ్య పరంగా, విద్యాపరంగా నష్టపోవడం, సమాజంలో చులకన భావంతో బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పాడుతుందన్నారు. కో-ఆర్డినేటర్ ప్రశాంతి, జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై రామలింగేశ్వరరావు

వ్యసనాలతో ఏకాగ్రత కోల్పోతారు

ఏలేశ్వరం: మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డిసునీత అన్నారు. కళాశాలలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వాడకంతో నాడీవ్యవస్థ దెబ్బతిని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. చెడు వ్యసనాలతో విద్యార్థులు దూరం పాటించాలని, వ్యసనాలతో చదువుపై ఏకాగ్రత కోల్పోయి నష్టపోతారన్నారు. అనంతరం అక్రమ రవాణా నివారణపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం మేనేజర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకుడు రామారావు, శ్రీలక్ష్మీ, సురేష్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తీరప్రాంత గ్రామాల్లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం

తొండంగి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేపథ్యంలో సమాజంలో యువత మాదక ద్రవ్యాల వినియోగంపై అప్రమత్తంగా లేకుంటే భవిష్యత్తు శూన్యమని తొండంగి ఎస్సై బి.జగన్మోహన్ రావు అన్నారు. గురువారం మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ లక్ష్మణుడుపేటలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా నిర్మూలనా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సై జగన్మోహన్‌రావు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావంతో యువత మాదక ద్రవ్యాలకు బానిసలై భవిష్యత్తు చేతులారా అంధకారం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

తుని రూరల్: డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో విద్యార్థులంత భాగస్వామ్యులు కావాలని తుని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ అన్నారు. గురువారం వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఆధ్వర్యంలో ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక, అక్రమ రవాణా దినోత్సవం, ఆరోగ్య, సామాజిక, న్యాయపరమైన సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ గీతారామకృష్ణ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకంతో వ్యక్తిగత, కుటుంబ సమస్యలు ఎదురవుతాయన్నారు. డ్రగ్స్ సరఫరా చేసినా వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జగ్గంపేట: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జగ్గంపేటలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని స్థానిక పోలీసు స్టేషన్ ఎదురుగా ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాల వినియోగంతో సమాజం తీవ్రంగా ప్రభావితమవుతోందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, జగ్గంపేట ఎస్సై రఘునందన్‌రావు, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.